RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 300 | బుధవారం
నవంబర్ 05, 2025 | పేజీలు : 6
వెల : రూ.3-00



అలింకో ఉపకరణాలు, సహాయక పరికరాలతో మేలు

4లో..



# సపోర్ట్ అస్..

- ఇన్నోవేషన్ హబ్‌గా 'హైదరాబాద్'
- పెట్టుబడులలో జర్మనీ భాగస్వామ్యం కోరుతున్నాం
- ఆ దేశ ప్రతినిధులను కోరిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్
- 'డుయిష్' జీసీసీ వివరాలు సీఎంకు అందజేసిన ప్రతినిధి బృందం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

హైదరాబాద్‌ను ఇన్నొవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్మనీకి చెందిన ప్రతినిధి బృందాన్ని కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ప్రధానంగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులు పెట్టాలని కోరారు. జర్మనీ కాన్సులేట్ జనరల్ (చెన్నయ్) కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో భేటీ అయింది. జర్మనీకి చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ డుయిష్ బోర్సా విస్తరణలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వివరాలను అందించారు.

**- జర్మనీ నుంచి టీచర్లను పంపండి**

తాజాగా డుయిష్ బోర్సా కంపెనీ ఏర్పాటు చేస్తున్న జీసీసీ ద్వారా వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు జర్మనీ బృందం వివరించింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు ఈ సందర్భంగా జర్మనీ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్చుకునే విషయంలో హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, ఒకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించడం వంటి అంశాల్లో సహకరించాలని అన్నారు. ఈ భేటీలో డుయిష్ బోర్సా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ క్రిస్టోఫ్ బోమ్, జర్మనీ గౌరవ కాన్సూల్ (ఏపీ, తెలంగాణ), హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ అమిత ఆర్ దేశాయ్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.




## బస్సు ప్రమాదంపై స్పందించిన మానవ హక్కుల కమిషన్

మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన భయానక బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు ప్రారంభించింది. ఈ ఘటనలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురికి తీవ్ర గాయాలు అయిన విషయం తెలిసిందే. కమిషన్ డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. అలాగే జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా నివేదికను పంపాలని కమిషన్ ఆదేశించింది. ప్రమాద సమయంలో టిప్పర్‌లో ఉండిన కంకర బస్సుపై పడటమే అధిక ప్రాణనష్టం కు కారణమైందని ప్రాథమిక సమాచారం. ఈ ఘటన మళ్లీ రోడ్డు భద్రత, రవాణా తనిఖీల వ్యవస్థ, హెవీ వాహనాల నియంత్రణపై కీలక ప్రశ్నలు లేవనెత్తింది.

## సమస్యలతో తెలంగాణ సతమతం..!

**వేద న్యూస్, ఆదిలాబాద్ :**

తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ప్రారంభించిన "జాగృతి జనం బాట" కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. "సామాజిక తెలంగాణ సాధన మా లక్ష్యనన్నారు. రైతుల సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కవిత, పత్తి రైతుల దుస్థితి చూసి మనసు కలచుకుపోయిందని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా, ప్రజా ప్రతినిధులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని మండి పడ్డారు. తేమ శాతం పేరుతో రైతులను దోచుకోవద్దని హెచ్చరిస్తూ, కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకువచ్చినట్లు

మిగతా 3వ పేజీలో..



## హైకోర్టు సీరియస్..!

- స్థానిక సంస్థల ఎన్నికలపై 24లోపు తేదీ ప్రకటించండి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. పంచాయతీల పదవీకాలం పూర్తై చాలాకాలం అయినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వకపోవడం పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఎన్నికల ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ఈ ప్రకారం పంచాయతీల

మిగతా 3వ పేజీలో..



## మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్



**వేద న్యూస్, హైదరాబాద్:**

మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని జూడాలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఐజాక్, జనరల్ సెక్రటరీ అజయ్ నేతృత్వంలోని జూనియర్ డాక్టర్ల బృందం, మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన నివాసంలో కలిశారు. తమ దశాబ్దకాల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో స్థానిక డాక్టర్లకు పీజీ సీట్లు పొందే అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని జూడాలు తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల బలోపేతానికి, నాణ్యమైన మెడికల్ విద్యను అందిం చడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జూడాలు అభినందించారు. ఇటీవలే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెంచడం, టీచింగ్ ఫాకల్టీ నియామకం, జూనియర్ డాక్టర్లు - సీనియర్ రెసిడెంట్లకు స్టైఫండ్ 15 శాతం పెంచిన విషయాలను జూడాలు గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కాలేజీల్లో సౌకర్యాలు పెరిగాయని, దీంతో ఇటీవల జరిగిన అసెస్‌మెంట్‌లో ఒక్క సీటును కూడా నేషనల్ మెడికల్ కమిషన్ తగ్గించలేదని జూడాలు గుర్తు చేశారు. కాలేజీల అభివృద్ధితో పీజీ, యూజీ సీట్లు అదనంగా వచ్చాయని.. దీంతో తమకు అవకాశాలు పెరిగాయని డాక్టర్లు వివరించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని జూడాలు తెలిపారు.

## అక్రమం..సక్రమం..!?


- విద్యార్థుల ప్రాణాలతో ఓ స్కూల్ చెలగాటం!
- రూల్స్ ఉల్లంఘించినా ఆఫీసర్లకు కనిపిస్తలే?
- సదరు ప్రైవేటు పాఠశాల తీరుపై ఉదాసీనత
- తగు చర్యలు తీసుకోవాలని పలువురి విజ్ఞప్తి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

'ముడుపులు అందితే చాలు..' అక్రమం సక్రమం అవుతుందనే పరిస్థితులు నెలకొన్నాయి.! యథేచ్ఛగా నియమ నిబంధనలు ఉల్లం'ఘనలు' కనపిస్తున్నా చర్యలకు మాత్రం అసలు పట్టింపు లేకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ శివనగర్‌లోని ఓ ప్రయివేటు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ కొనసాగిస్తోంది.


**- తాజాగా విద్యార్థికి తీవ్రగాయాలు**

సదరు పాఠశాల యాజమాన్యం నాలాపై అక్రమ కట్టడం కట్టి.. పార్కింగ్‌కి ఉపయోగిస్తున్నది. ఈ క్రమంలోనే తాజాగా మంగళవారం ఆ ప్రదేశంలో సైకిల్ పార్క్ చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. తొమ్మిదో తరగతి విద్యార్థి నాలాలో పడిపోగా, తీవ్రగాయలు అయ్యాయి. వెంటనే అసుపత్రికి స్టూడెంట్‌ను తరలించారు. కాగా, స్కూల్ యాజమన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కాలనీవాసులు అంటున్నారు.



**- అంతా మా ఇష్టం!**

సదరు ప్రయివేటు పాఠశాల యాజమాన్య తీరు 'అంతా మా ఇష్టం!' అనే రీతిలో కొనసాగుతున్నదని తెలుస్తున్నది. సదరు పాఠశాల మేనేజ్‌మెంట్ చేపట్టిన అక్రమ కట్టడాల వల్ల వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోతున్నదని కాలనీవాసులు చెబుతున్నారు. గతంలో బల్దియా అక్రమ కట్టాడాన్ని తొలగించినా మళ్లీ నిర్మాణం చేపట్టారని తెలిపారు. సదరు స్కూల్‌లో అర్హత కలిగిన అధ్యాపకులు లేకపోయినా, అధిక ఫీజులు వసూలు చేసినా సంబంధిత శాఖ అధికారులు కనీసంగా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన సెలవులను బేఖాతరు చేస్తూ సదరు స్కూల్ మేనేజ్‌మెంట్ "మేం ప్రకటిస్తేనే.. సెలవు" అంటూ హుకూం జారీ చేస్తున్నారంటే..వారికి అండగా నిలుస్తున్న వారు ఎవరో ఉన్నారనే వాదన ఉంది. మోకాళ్ల తోతు నీళ్లొస్తే తప్ప స్కూల్‌కు హాలిడే ఉండదని, దాంతో



డ్రయినేజీ మురుగు నీళ్లలోనే తడుస్తూ పిల్లలు బడికి రావాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వెల్లడిస్తున్నారు. సదరు ప్రయివేటు పాఠశాల తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, ఆ స్కూల్ యాజమాన్యానికి సహకరిస్తున్న వారిపైన కూడా ఫోకస్ పెట్టి.. తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు కోరుతున్నారు.

# కొబ్బరి నీళ్ళు అమ్మబడవు..!





**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

భద్రకాళీ ఆలయంలో కొబ్బరి నీళ్ళ అమ్మకాలపై వస్తున్న విమర్శలకు భద్రకాళి దేవస్థాన ఆలయ ఈవో రామాల సునీత స్పందించారు. కొబ్బరికాయలు కొట్టే టెండర్ మాత్రమే టెండర్దారుడైన రమేష్ కు ఇవ్వడం జరిగిందని అన్నారు. కొబ్బరి నీళ్ల అమ్ముకునే అధికారం ఇవ్వలేదని రమేష్ ను హెచ్చరిస్తూ రూ. 15 వేలు జరిమానా విధించారు. ఒకవేళ తిరిగి మళ్ళీ కొబ్బరి నీళ్ల అమ్మకాలు మొదలు పెడితే టెండర్లు రద్దు చేస్తామని ఇంకోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా టెండర్దారుడు రమేష్ దగ్గర లిఖిత పూర్వకంగా లేఖను బోర్డు డైరెక్టర్ సమక్షంలో ఆలయ ఈవోకి అందజేశారు.

# ప్రజలు చైతన్యవంతంగా ఉన్నప్పుడే దేశ అభివృద్ధి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**


లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు. భారతదేశంలో అవినీతి నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం విజిలెన్స్ వారోత్సవాలు అక్టోబర్ 27వ తేదీ నుండి నవంబర్ మూడో తేదీ వరకు అవినీతి రహిత సమాజం కోసం ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావడం అవినీతి క్యాన్సర్ వ్యాధి లాంటిదని దేశ సంపద అవినీతిమయం కాకుండా ప్రజలు చైతన్యవంతంగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుందని అవినీతి ఏ రూపంలో ఉన్న దేశ అభివృద్ధికి ప్రమాదకరమని వాటి నివారించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు విజిలెన్స్ వారం ప్లేజ్ , ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల పరిపాలన భవనం నుండి ములుగు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అవినీతి నిర్మూలన కోసం అందరూ చైతన్యవంతులు కావలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, మోహన్




సీనియర్ అండర్ ఆఫీసర్, ,జూనియర్ అండ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆసియా, సాహిత్య, రవళి, సాయి చందర్ ,సిరివెన్నెల , లక్ష్మీ ప్రసాద్, కౌశిక్,సాయి కృష్ణ, అభినవ్, హరి లోకేష్, సాయి, రజిత, మొదలగు వారు పాల్గొన్నారు

# మాజీ మంత్రి హరీష్ రావుని పరామర్శించిన ఎమ్మెల్సీ

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్ర బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఇటీవల తన తండ్రి తన్నీరు సత్యనారాయణ రావుని కోల్పోయిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుని వారి కుటుంబ సభ్యులను కోకాపేట్లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. దివంగత సత్యనారాయణ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, హరీష్ రావు , వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా దేవుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు

# బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం

**– ఎర్రగడ్డ లో ఇంటింటి ప్రచారం**

**వేద న్యూస్, టేక్మాల్ :**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదేశాల మేరకు ఎర్రగడ్డ లో ఇంటింటి ప్రచారాన్ని ఆందోల్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో కలిసి మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప,నాయికోటి భాస్కర్,యం. సలీం,కమ్మరి సిద్దయ్య,కోండి మహేందర్,విఠల్,తదితరులు తో కలిసి ప్రచారాన్ని చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రెండు సంవత్సరాలు అవుతున్న అమలు చేయకుండ రేవంత రెడ్డి జూబ్లీహిల్స్ లో ప్రచారం చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఇక్కడి ప్రజలు తప్పకుండా బి ఆర్ఎస్ పార్టీనీ అధిక మెజార్టీ గెలిపిస్తారని వీరప్ప ఆశాభావ వ్యక్తం చేశారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

నవంబర్ 2026వరకు ఇంటిగ్రెటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్, 100పడకల అస్పత్రి నిర్మాణాలను పూర్తి చేసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు అంకితం ఇస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రెటెడ్ డివిజనల్ ఆఫిస్ కాంప్లెక్స్, 100పడకల అస్పత్రి నిర్మాణ పనులను అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పరిపాలన, వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. నవంబర్ 2026నాటికీ నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. భవనాలు నిర్మించడమే కాదు అన్ని వసతులతో కూడిన సౌకర్యలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 100పడకల అస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మెడికల్, నాన్ మెడికల్ సిబ్బంది, ఇతర అవసరలకు సంబందించిన జాబితా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అస్పత్రి నిర్మాణం పూర్తి అయ్యే నాటికీ అన్ని వసతులు, సౌకర్యాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన నిర్మాణాలు



పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గ ప్రజలపై ఉన్న ప్రేమతో అడిగిన వెంటనే కాదనకుండా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ.1400కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు అయ్యాయని అందులో వివిధ పనులు ప్రారంభమై పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రూ.1400కోట్ల అభివృద్ధి పనులను 18నెలలలో పూర్తి చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలకు అనుమతులు వచ్చాయని, ఇంకా వేలేరు, చిల్పూర్ లలో మండల కార్యాలయాలు, కొన్ని రోడ్లకు అనుమతులు రావాల్సి ఉందని త్వరలోనే మంజూరు తీసుకువస్తానని తెలిపారు. కొంత మంది అభివృద్ధి పనులకు అడ్డుతగిలే ప్రయత్నం చేస్తున్నారాని అన్నారు. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిలో కలిసి రావాలని, సహకారం అందించాలని కోరారు. కేటీఆర్ అధికారం కోల్పోయినా అహంకారం కోల్పోలేదని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. కేటీఆర్ అహంభావంతో మాట్లాడటం సరికాదని సూచించారు. దేశానికే ఆదర్శవంతమైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, ఇందిరమ్మ ఇల్లు, 21వేల కోట్ల రుణ మాఫీ, సన్నాలకు 500బోనస్ వంటి పథకాలు కేటీఆర్ కళ్ళకు కనిపించడం విమర్శించారు. ఉద్యమం చేసిన పార్టీ అని ప్రజలు రెండు సార్లు అధికారం ఇస్తే కల్వకుంట్ల కుటుంబం తెలంగాణపైన పడి దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని.... ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ముందుగా తన చెల్లి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఇంట్లో కుటుంబ సభ్యులనే ఒప్పించలేని స్థితిలో కేటీఆర్ ఉన్నాడని అన్నారు. కేటీఆర్ ముందు నీ ఇంటి వ్యవహారం చక్కదిద్దుకోని ఆతర్వాత ఇతరులను విమర్శించాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డివో, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేరం చేస్తే కఠిన చర్యలు తప్పవు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఈసంవత్సరంలో న్యాయస్థానాల్లో 71 కేసుల్లో 82 మందికి జైలు శిక్షలు,జరిమానాలు నేరనియంత్రణ,న్యాయస్థానాలలో న్యాయ నిరూపణలో జిల్లా పోలీసులు విశేష ఫలితాలను సాధిస్తున్నారని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.ఈ సంవత్సరం (జనవరి నుండి అక్టోబర్) కాలంలో జిల్లా పోలీసు శాఖ సమగ్రంగా వ్యవహరించి న్యాయస్థానాల్లో 71 కేసుల్లో తీర్పులు వెలువడగా వాటిలో 82 మంది నేరస్తులకు జైలు శిక్షలు, జరిమానాలు విధించబడ్డాయని ఎస్పీ వివరించారు.న్యాయస్థానాల ద్వారా విధించబడిన జైలు శిక్షల వివరాలు హత్య సంబంధించి 03 కేసులో 05మంది నిందితులకు జీవిత జీవిత ఖైదు. వివిద కేసులో జైలు శిక్షల వివరాలు5 సంవత్సరాల జైలు శిక్ష 04 కేసులలో 05 మంది నిందితులు,4 సంవత్సరాల జైలు శిక్ష 01 కేసులో ఒక నిందితుడు,3 సంవత్సరాల జైలు శిక్ష 11 కేసులలో 14 మంది నిందితులు,2 సంవత్సరాల జైలు శిక్ష 02 కేసులలో 03 మంది నిందితులు,1సంవత్సరాల జైలు శిక్ష 26 కేసులలో 28 మంది నిందితులు ,బీలో వన్ ఇయర్ 24 కేసులలో 26 మంది నిందితులు ఉన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరన్నారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో వ్యూహాత్మకంగా విచారణ జరిపి న్యాయ నిరూపణతో శిక్షలు పడేలా చేస్తున్నాం. క్షణికావేశంలో చేసిన నేరాలకైనా న్యాయశిక్ష తప్పదు. అందరూ చట్టానికి లోబడేలా ప్రవర్తించాలని అన్నారు.జిల్లాలో మహిళలపై నేరాలు,మద్యం, గంజాయి,దొంగతనాలు, మోసపూరిత ఆర్థిక నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి,కేసులు త్వరితగతిన దర్యాప్తు చేసి,



కోర్టులో పటిష్టమైన సాక్ష్యాలతో ప్రాసిక్యూషన్ విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా ప్రాసిక్యూషన్ అధికారులు,సీఐలు,ఎస్ఐలు, ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా కేసుల పురోగతిని సమీక్షిస్తూ,తీర్పులు శిక్షల రూపంలో రావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు పోలీసుల పట్ల నమ్మకం ఉంచి చట్టం పాటించేలా సహకరించాలని పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ కంప్లైంట్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




**– జిల్లా ఇన్ చార్జి ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత**

ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్ లో ప్రైవేట్ కంప్లైంట్ కేసులు, పాత కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఇన్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షురాలు జిల్లా న్యాయ సేవాధికర సంస్థ, రాజన్న సిరిసిల్ల బి.పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో స్పెషల్ లోక్ అదాలత్ పై సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజల మేలు కోసం పాత కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పెండింగ్లో ఉన్న చిన్న క్రిమినల్ కేసులు, ఇతర కంపౌండబుల్ కేసులను ఆధునిక పద్ధతుల్లో సమర్ధవంతంగా పరిష్కరించేందుకు, ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని అన్నారు. కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, ప్రజలకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ , సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసరావు మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం లో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో బుధవారం (నేడు)ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు, దంత పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇందులో లయన్స్ కంటి ఆసుపత్రి నుండి కంటి నిపుణులు, హెూప్ వెల్ హాస్పిటల్ నుండి దంత వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ అలీ గార్ల చే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది.



# హైకోర్టు సీరియస్..!

కాలపరిమితి ముగిసిన ఆరు నెలల లోపే ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హైకోర్టు గుర్తుచేసింది. ఈ నిబంధనను ఉల్లంఘించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలు కీలకమని, వాటిని నిలువరించే ప్రవర్తన అసహనీయమని పేర్కొంది. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ జరిగిన విచారణలో ఎన్నికల కమిషన్ తమ వాదనలు వినిపించింది. బీసీ రిజర్వేషన్ల విషయంలోనే తమకు అభ్యంతరం ఉందని, ఎన్నికలు నిర్వహించడంపై ఎలాంటి అభ్యంతరం లేకపోయిందని ఎస్ఈసీ కోర్టుకు తెలిపింది. అయితే, బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన సమస్య పరిష్కారం వరకూ ఆ గ్రామాలను పక్కన పెట్టి మిగతా గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించింది.

ఈ ప్రతిపాదనపై హైకోర్టు గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేసింది. పాక్షికంగా గ్రామాలను వేరు చేసి ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం అని వ్యాఖ్యానించింది. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం, ఎస్ఈసీ సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని సూచించింది. అన్ని గ్రామాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానమే సముచితమని కోర్టు అభిప్రాయపడింది. చివరగా, హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ ఈ నెల 24వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికల తేదీ ప్రకటించాల్సిందే అని ఆదేశించింది. ఇకపై ఆలస్యం ఏ మాత్రం సహించబోమని, ప్రభుత్వం రాజ్యాంగపరమైన బాధ్యతను నిర్వర్తించాలని కోర్టు తేల్చి చెప్పింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల చర్చ మళ్లీ హీట్ అయ్యింది.

# సమస్యలతో తెలంగాణ సతమతం..!

వెల్లడించారు. "రైతును విస్మరించే రాజ్యం ఎప్పుడూ బాగుండదు" అని కవిత వ్యాఖ్యానించారు. విద్యా రంగం పరిస్థితిని కవిత తీవ్రమైన పదజాలంలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు బంద్ చేస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు పణంగా పెడుతున్న ప్రభుత్వాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. "కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తారు.కానీ పేద విద్యార్థులకు ఫీజు ఇచ్చేది లేదు. విద్య లేకుండా పేదలను నాశనం చేస్తున్నారు" అంటూ వ్యాఖ్యానించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కోసం తన వంతు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పలు ఉదాహరణలు చూపిస్తూ కవిత ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులపై సీరియస్‌గా ప్రశ్నలు వేశారు. ముఖ్యంగా చనాఖా-కొరటా ప్రాజెక్ట్ వ్యయం రూ.300 కోట్ల నుంచి రూ.2 వేల కోట్లకు ఎలా పెరిగిందో బీఆర్ఎస్ వివరించాలని డిమాండ్ చేశారు. ఇంకా 10శాతం పనులు పూర్తయితే 50 వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని, మహారాష్ట్రతో సమన్వయం చేసి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కోరారు. అలాగే ఐటీ టవర్, రైల్వే బ్రిడ్జిలు, వెల్ఫేర్ స్కూల్, టూరిజం అభివృద్ధి, ఎయిర్‌పోర్ట్ భూమి వివాదం తదితర సమస్యలను ఒకదాని వెంట ఒకటి లిస్ట్ చేశారు."జాగృతి బలోపేతం చేసి ప్రజల సమస్యలు తీర్చేలా పోరాటం చేస్తాం. భవిష్యత్‌లో ఏమి జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను నాలుగు నెలలు ప్రజల మధ్య గడిపిన తర్వాతే నిర్ణయం" అని కవిత వ్యాఖ్యానించారు. జనం బాట ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కదిలే వరకు జాగృతి వాయిస్ వినిపిస్తూనే ఉంటుందన్నారు.

## ఉద్యోగులకు శుభవార్త: 8వ వేతన సంఘం ఏర్పాటు




వేద న్యూస్ డెస్క్ : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం భారీ శుభవార్త అందించింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న 8వ వేతన సంఘం ఏర్పాటు చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ మేరకు అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తూ, కమిషన్‌లో సభ్యుల నియామకాలను కూడా వెల్లడించింది. మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కొత్త వేతన సంఘానికి న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను చైర్‌పర్సన్‌గా నియమించింది. ఇదే తొలిసారి వేతన సంఘానికి ఒక మహిళ చైర్‌పర్సన్‌గా నియమితురాలవడం విశేషం. కమిషన్‌లో ప్రొఫెసర్ పులక్ ఘోష్‌ను పార్ట్‌టైమ్ సభ్యుడిగా, శ్రీ పంకజ్ జైన్‌ను సభ్య కార్యదర్శిగా కేంద్రం నియమించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా హేతుబద్ధమైన, పని తీరు ఆధారిత వేతన విధానాన్ని రూపొందించడమే కమిషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపింది.

# కిడ్నీల ఆరోగ్యానికి ముఖ్య సూచనలు

**– ప్రతీ వంద మందిలో ఏడుగురికి కిడ్నీ సమస్యలు – 'కిడ్నీ ఆరోగ్యం' అందరికీ అత్యంత ముఖ్యం**

## – కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

ఉండేది పిడికెడే అయినా అవి చేసే పనులు చాలా గొప్పవి. అందుకే కిడ్నీలను మహా గట్టి పిండాలు అని అంటారు. చిక్కుడు గింజల ఆకారంలో ఉండే ఈ కిడ్నీలు చక్కగా పని చేస్తేనే మనిషి ఆరోగ్యంగా ఉంటారని, వాటికి ఏ మాత్రం చిక్కులు వచ్చినా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి 100 మందిలో సుమారు ఏడుగురికి కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నాయని ఇటీవల ఓ సర్వేలో స్పష్టమయింది. ఇది ఒక ఆందోళనకర గణాంకం కాగా, దీనికి ముఖ్య కారణాలు అధిక బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్, తగినంత నీరు తాగకపోవడం, అజాగ్రత్తగా మందులు వాడటం మొదలైనవని ప్రముఖ వైద్యుడు, ఎండీ జనరల్ మెడిసిన్, కన్సల్టెంట్ ఫిజీషియన్, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. కిడ్నీల రక్షణకు, కిడ్నీ సంబంధిత వ్యాధులు రాకుండా ప్రతీ ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలిపారు.

**– డ్రింక్ ఎనఫ్ వాటర్**

ప్రతీ ఒక్కరూ తగినంత నీరు తాగాలని డాక్టర్ సురేశ్ సూచించారు. ప్రతీ రోజూ 2.5 నుంచి 3 లీటర్ల వరకు నీరు తాగాలని (చలికాలంలో కొంచెం తక్కువ, వేసవిలో ఎక్కువ) అని స్పష్టం చేశారు. మూత్రం లేత పసుపు రంగులో ఉండాలి అంటే సరిపడా నీరు తాగాలన్నారు. రక్తపోటు (బీపీ) నియంత్రణలో ఉంచుకోవాలని చెప్పారు. బీపీ ఎక్కువగా ఉండటం కిడ్నీలకు శత్రువు అని వివరించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి బీపీ చెక్ చేసుకోవాలని, డయాబెటిస్ నియంత్రణలో ఉంచుకోవాలని, షుగర్ ఎక్కువగా ఉంటే కిడ్నీ ఫిల్టర్ యూనిట్లు (నెఫ్రాన్స్) దెబ్బతింటాయని చెప్పారు. రెగ్యులర్‌గా ఫాస్టింగ్ చేసేవారు పీపీ షుగర్, హెచ్‌బీఏ1సీ టెస్ట్ చేయించుకోవాలన్నారు. నొప్పి మందులు (పెయిన్ కిల్లర్స్) జాగ్రత్తగా వాడాలన్నారు. ఐబుప్రొఫెన్, డైక్లోఫెనాక్ మొదలైన.. లాంటివి ఎక్కువ రోజులు వాడితే కిడ్నీకి హాని ఏర్పడుతుందన్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే డాక్టర్ సూచనతో పెయిన్ కిల్లర్స్ వాడాలని స్పష్టం చేశారు.

**– లో సాల్ట్ ఫుడ్ తీసుకోండి**

తక్కువ ఉప్పు, తక్కువ ప్రోటీన్ ఆహారం తీసుకోవాలని డాక్టర్ సురేశ్ వెల్లడించారు. ఉప్పు అధికంగా ఉండే పచ్చళ్లు, చిప్స్, ప్యాక్డ్ ఫుడ్ తగ్గించాలని, నాన్ వెజ్, రెడ్ మీట్ తగ్గించాలన్నారు. మద్యపానం, పొగ తాగడం పూర్తిగా మానేయాలని చెప్పారు. మద్యపానం, ధూమపానం..రక్తనాళాల్ని దెబ్బతీసి కిడ్నీలకు హాని చేస్తాయని వెల్లడించారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలని పేర్కొన్నారు. సీరమ్ క్రియాటినైన్, యూరిన్ అల్బుమిన్, బీపీ, బ్లడ్, షుగర్ టెస్టులు 6 నెలలకు ఒకసారి చేసుకోవడం మంచిదన్నారు. మైక్రోఅల్బుమినురియ టెస్ట్ ఎర్లీ కిడ్నీ డ్యామేజీని వెల్లడిస్తుందని పేర్కొన్నారు. మూత్రం తరచుగా ఆపడం వల్ల ఇన్ఫెక్షన్ అవుతుందని, అందుచేత ఎక్కువ సేపు ఆపుకోవద్దని సూచించారు. అధిక బరువు నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. స్థూలకాయం (ఒబెసిటీ) వల్ల బీపీ, షుగర్ పెరిగి కిడ్నీ



సమస్యలకు దారి తీస్తుందని వివరించారు. హెర్బల్, లోకల్ మందులు జాగ్రత్తగా వాడాలని చెప్పారు. కొన్ని ఆయుర్వేద / లోకల్ మందులలో హానికరమైన హెవీ మెటల్స్ ఉంటాయని, డాక్టర్ సలహా లేకుండా వాడొద్దన్నారు.

**– చివరి దశలోనే లక్షణాలు**

కిడ్నీ వ్యాధులు సాధారణంగా నిశ్శబ్దంగా ప్రారంభమవుతాయని డాక్టర్ ఊడుగుల సురేశ్ స్పష్టం చేశారు. చివరి దశలో మాత్రమే లక్షణాలు (వాంతులు, అలసట, వాపులు, మూత్రం తగ్గడం) కనిపిస్తాయని, కాబట్టి ప్రమాదానికి ముందే పరీక్షలు చేసుకోవడం ఉత్తమమని వెల్లడించారు.


# సర్కారీ ఆస్పత్రిలో సక్కని వైద్యం

**- ప్రైవేట్‌కు దీటుగా హాస్పిటల్‌లో సేవలు - ఒకే శస్త్రచికిత్సలో కణితి తొలగింపు, సురక్షిత ప్రసవం**

**- ప్రభుత్వ దవాఖానాపై నమ్మకం రెట్టింపయిందన్న పలువురు - డాక్టర్లు, వైద్య సిబ్బందికి పేషెంట్ తరుపు వారి సన్మానం**

**వేద న్యూస్, హుజురాబాద్:**

సర్కారీ ఆస్పత్రిలో సక్కని వైద్య సేవలు అందాయని పేషెంట్ తరఫు వారు సంతోషం వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే..జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన బోగ భిక్షపతి – కరుణ దంపతుల కుమార్తె ప్రవళిక, గత నెల 30న (గురువారం) హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఇది ప్రవళికకు రెండో కాన్పు కాగా, ఆమె మొదటి ప్రసవం కూడా ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. అయితే, రెండో కాన్పు సమయంలో ప్రవళిక గర్భాశయంలో కణితి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. ప్రైవేట్ ఆసుపత్రుల కంటే కూడా ప్రభుత్వ ఆసుపత్రి పై ఉన్న అపార నమ్మకంతో, ప్రవళిక కుటుంబసభ్యులు ఇక్కడే చికిత్సకు మొగ్గు చూపారు.ఆ నమ్మకాన్ని సర్కారీ దవఖాన వైద్యులు నిలబెట్టుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అత్యంత నైపుణ్యంతో ఒకే శస్త్రచికిత్సలో కణితి తొలగింపు, ప్రసవం రెండింటినీ విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో గర్భాశయాన్ని తొలగించకుండానే కణితిని తొలగించారు. ప్రవళిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, క్లిష్టమైన చికిత్సలు కూడా సురక్షితమైనవి, నమ్మకమైనవని



మరోసారి రుజువైందని ప్రవళిక భర్త మంతెన ప్రవీణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిపై తమకున్న నమ్మకం రెట్టింపు కావడంతో, ఆయన మంగళవారం రోజున ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించి, స్వీట్లు పంచి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పండుగల తీరులో మార్పు!

డెస్క్ : పండుగలు అంటే మనుషుల మధ్య ఆనందాన్ని, స్నేహాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సామరస్యాన్ని, ఆప్యాయతను, మనుషుల, ప్రకృతి-పంచాభూతాల మధ్య, మానవ ఆవాస పర్యావరణ ఆరోగ్యాన్ని బాగుండేలా స్థిరంగా ఉంచే సందర్భోచిత వేడుక రోజులు. అందరూ కలిసి మెలిసి, ఆనందోత్సాహలతో జరుపుకునే ఈ ఫెస్టివల్స్ రోజున చిన్నా-పెద్దా, విభిన్న జాతులు, భిన్న మతాలు, కులాలు ఒకరికొకరు వేరైనా కలిసి జరుపుకుంటారు. ప్రతీ పండుగకు భారతదేశంలో ఒక నిర్దిష్టమైన కారణమూ, సందర్భముగా, పురాణము, ఇతిహాసము ఆనవాయితీ ఉన్నదని మన పూర్వీకులు చెబుతుంటారు.

**– పర్యావరణహితంగానే పండుగలు ఉండాలి..**

పండుగ వల్ల పర్యావరణానికి హాని జరగకూడదు. కానీ మన దేశ పండుగలు జరుపుకునే విధానంలో అనేక మార్పులు వస్తున్నాయి. పండుగలను జరుపుకునే క్రమంలో మన సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులు రోజురోజుకూ మారిపోతున్నాయి. ఫెస్టివల్స్‌ను సెలెబ్రేట్ చేసుకునే సందర్భాల్లో వ్యక్తిగత సామర్థ్యం చూపించుకోవటం, సాంఘిక స్థాయి ప్రదర్శన, సంతోష అనుభవం కోసం మరీ విపరీత దొరణలను ఎంచుకుంటున్నారు. ఆ విపరీతమైన కారణ రీతులలో ఆర్థిక, సామాజిక, శరీరక, మానసిక, ఆరోగ్య పర్యావరణ, సహజ విపత్తుల సమస్యలను కోరి తెచ్చుకుంటున్నారు. సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా జరుపుకోవాల్సిన పండగలు వాటి పంథాలను మార్చుకుంటున్నాయి. పండగలు ఒక్కొక్కసారి పోటీ పడి జరుగుతున్నాయి. ఆ మార్పు అనేక చెడు దారులకు చేరువ చేస్తున్నాయి.

**– భారతీయ పండుగలపై పాశ్చాత్య ప్రభావం**

అభివృద్ధి, మారుతున్నకాలం, శాస్త్ర-సాంకేతికత ప్రభావం, ప్రపంచీకరణ, వలసల కారణంగా ఈ దేశంలోకి అనేక రూపాల్లో పాశ్చాత్య సంసృతి విస్తరిస్తోంది. భాష, కట్టు, బొట్టు, సంగీతం, సాహిత్యం, అంతర్జాలం, మొబైల్, సాంఘిక మధ్యమాలు, భావప్రకటన, సమాచార మార్పిడి, సంభాషణ మొదలైన బాటలలో నుండి దీని ప్రభావం దేశంపైన ప్రజలపైన ఎంతో చూపుతోంది. పండుగ సెలెబ్రేషన్లలో, గుడులల్లో, బడులల్లో, విగ్రహాల ముందు డీజేలు, ఆటలు, ద్వందార్థపు మాటలు, పాటలు, నృత్యాలు, రంగుల కాంతులు క్రాకర్స్ కాల్చటం, మద్యం వినియోగం, మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసలు విజ్రుంభన ప్రభావం రోజురోజుకూ విఫరీత ధోరణులతో చెలరేగిపోతోంది.

**– పర్యావరణ కాలుష్యం**

పండుగల పేరుచేప్పుకుని సహజ వనరుల (భూమి కాలుష్యం, వాయుకాలుష్యం, జలకాలుష్యం, ధ్వని కాలుష్యం, ఆహారం కాలుష్యం మొ.) ధ్వంసం, విష రసాయణాల వాడుక, టపాకాయల కాల్పులు భూమిని వనరులను కలుషితం చేస్తూ హానిచేకూరుస్తున్నారు. సంవత్సరలైన పర్యావరణంలో కలిసి నశించలేని రసాయన పదార్థాలు (పీవోపి), కాన్సర్ కారక రసాయన, ఘన, ద్రవ, వాయు పదార్థాల వాడుక కొనసాగుతోంది.

**– ఎవరి ప్రయోజనం కోసం మారుతున్న పండుగలు?**

ఎవరి ప్రయోజనం కోసం పండుగలు జరుపుకునే పంథాను మార్చుకుంటున్నాయి? ఆర్థికలావాదేవీలు ఎవరిమధ్య?, లాభాలు ఎవరికీ? వాతావరణ మార్పులు, మానసిక రుగ్మతలు, శరీరక, ఆర్థిక నష్టాలు ఎవరికీ? వీటిని క్రమపరచడంలో ఎవరికీ డబ్బు చేరుతోంది. కాలుష్యం (భూ, వాయు, జల శబ్ద కాలుష్యం) ఎవరికీ? అసలు బాధ్యులెవరు, బాధితులెవరు? ఈ విపరీత ధోరణులతో పండుగలను జరుపుకుంటూ.. రోజు రోజుకూ మనకు మనమే మృత్యు గొయ్యిలు తీసుకుంటున్నాం. ఆధిపత్య ధోరణిలో అన్ని పండుగలలోనూ మూఢ నమ్మకాలను ప్రోత్సాహిస్తూ జంతు బలులు, మాస పంపకాలు, విపరీతమైన మూఢ నమ్మకాలను అడ్డుట్టుకొని పూజలు, కొలుపులు, సామూహిక పండుగలు, జాతరలు, పేరుతో పక్షులను, జంతువులను, వాడుకోవడం, హింసించడం, విధేశి ఉత్పత్తుల వినియోగం (బానసంఛ, గ్లాసు మంజా దారం, రంగులు) చెట్లను నరకడం మొదలగు అసమతుల్య పర్యావరణ పరిస్థితులను ఏర్పరచి, భౌమ్యావరణంలో జీవవైవిధ్యానికి నష్టం వాటింపచేస్తున్నారు. పర్యావరణ రక్షణ కోణంలో వ్యక్తిగతంగా అందరిలో మార్పు రావాలి తప్ప పర్యావరణ, జీవశాస్త్ర శాస్త్రవేత్తల హెచ్చరింపులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో మార్పు పూర్తిగా తేలేక పోతున్నాం. మనిషి చేస్తున్న పర్యావరణ అకృత్యాలలో పండుగల కాలుష్య ఉత్పన్నాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సహజ ఉత్పత్తులైన పసుపు, కుంకుమ, మోదుగ పువ్వు, మైదాకు, సుద్ద, గట్టిపిండి మొ. రంగులతో ఒకరికొకరు రాసుకుని పూసుకునే హెూలీ పండుగను బలమైన, భయంకరమైన కృత్రిమ భారమైన లోహ రసాయన ఉత్పత్తుల (ఘన, ద్రవ రూపంలో)ను, కోడిగ్రుడ్లను, వాడుకును ఉపయోగించిన నల్లని గ్రీజ్ కలిసి కలుషితమైన ఆయిల్‌తో, చివరకు పశువుల మలంతో కూడా రాసుకుంటున్నారు, పూసుకుంటున్నారు. ఇది జుగుప్సకరమే కాదు..ఈ చర్యలవల్ల చర్మరోగాలు, హృద్రోగాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, కాన్సర్ జంతు సంక్రమణ (జూనోటిక్) హానికారక రోగాలు వ్యాప్తిచెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**– జీవ బలి పీఠాలు**

పండుగలొస్తున్నాయంటేనే మూఢనమ్మకాల ముసుగును అడ్డుపెట్టుకొని.. బక్రీద్ పండుగ రోజున పశువుల వధతో మాంసమును పంచుతున్నారు. కబేలాల దగ్గర వధిస్తున్న జంతు రక్తం ఏరులై పారుతూ ఉంటుంది. ధర్గా, ఊరుసు క్షేత్రాలలో ప్రతిరోజు కందూరు పండుగ పేరుతో జంతువులను కోసి పేగులు అర్పితున్నారు. దసరా రోజున జంతు బలి, సామూహిక గ్రామ దుర్గమ్మ పండుగలు, పెద్దమ్మ పండుగలు, పోచమ్మలు, కట్ట మైసమ్మలు, ఉప్పలమ్మ మారెమ్మలు, గ్రామదేవతల సామూహిక పండుగల్లో గుడుల వద్ద జరుపుతున్నారు. రక్తం ఏరులై పారుతూ ఉంటుంది. కొన్ని పండుగల్లో ఆచారంలో భాగమని పశువులను ఆటల్లో ఉపయోగించి పైశాచిక ఆనందం, జూదంగా జల్లికట్టు ఆట, కోళ్ల పందాలు బెట్టింగులు లాంటి ఆటలను, వాటి సందర్భంగా పండుగలు న్యాయస్థానాలు నిషేదాజ్ఞలు జారిచేసిన బేఖాతారు చేస్తూ నిర్వహిస్తున్నారు.

**– ప్రమాదాలు**

పండగలనేవి మన ఇంటికి ఆనంద భోగభాగ్యలు తెచ్చే సంతోష దినాలు కావాలి. కానీ, సంక్రాంతి రోజున ఎగురవేసే పతంగుల తాడు ఇప్పుడు చైనా గాజు మాంజాతో తయారు చేయగా దిగుమతి చేసుకొని మరీ పతంగులను ఎగురావేస్తున్నారు. దీని వల్ల అకాశంలో ఎగిరే విహంగాలకు మంజా తట్టి రెక్కలు తెగి అవి నెలరాలుతున్నాయి. ద్విచక్రవాహనదారులకు తగిలి మెడ, శరీరభాగాలు కోసుకుని తెగి, ప్రమాదలకు గురవుతున్నారు.

**– రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త, మాజీ సహాయ ఆచార్యులు, జేఎన్టీయూహెచ్, సంయుక్త కార్యదర్శి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, తెలంగాణ.**

# రైతులకు అవగాహన సదస్సు



**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ పరిధిలోని మంగళవారం టెక్మాల్ రైతు వేదికలో శంకరంపేట్ అ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులకు కాటన్ కాపాస్ అప్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంపేట్ -అ డివిజన్ పరిధిలో మొత్తం 21193 మంది రైతులు 34903 ఎకరాలలో ప్రత్తి పంట సాగుచేసారాని ప్రతి గ్రామంలో రైతులకి వ్యవసాయ అధికారులు కాటన్ కపాస్ అప్ గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు ఎవరు కూడా దళారులకి అమ్మి మోసపోకుండా ఈ కపాస్ అప్ లో అందరు స్లాట్ బుక్ చేసుకొని జీన్నింగ్ మిల్ కు తీస్కొని వచ్చి మద్దతు ధరొందాలని సూచించారు.పత్తి కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ చేసేందుకు ఏఎంసి లా వారీగా లోకల్ కమిటీ లను నియమించి ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందెల కృషి చేయాలన్నారు. అదేవిధంగా లీగల్ మెట్రాలాజి అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు. సీసీఐ అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జీన్నింగ్ మిల్లు యాజమాన్యం తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్ని మాపాక శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జాతీయ ఆహార భద్రత పథకం కింద జొన్న విత్తనాలని 100శాతం రాయితీ పై రైతులకి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, ఇంచార్జి ఏ డి ఏ రాంప్రసాద్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# అలింకో ఉపకరణాలు, సహాయక పరికరాలతో మేలు

## - ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో దివ్యాంగులు, వృద్దులకు సహాయ ఉపకరణాల పంపిణీకి నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆద్వర్యంలో ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఇంచార్జి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులకు ఎంపిక కోసం చేస్తున్న ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు,వయో వృద్దులు ఉపకరణాలు, సహాయక పరికరాల గుర్తింపు కోసము క్యాంపులు నిర్వహిస్తున్నారని వివరించారు. అర్హులందరూ పాల్గొనాలని సూచించారు. దివ్యాంగులు యూడీఐడీ కార్డ్ కోసం మొబైల్ లేదా మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన తేదీల్లో దవాఖానకు వెళ్లాలని, అక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులపై వివక్ష చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు.అర్హులకు పరికరాలు అందిస్తున్న అలింకో బాధ్యులను అభినందించారు. శిబిరాల్లో అర్హత సాధించిన వారికి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, రోలెటర్స్, ఎం ఎస్ ఐ ఈ డీ కిట్ / ఎం ఆర్ కిట్, స్మార్ట్ కేన్, అంధుల చేతి కర్ర, ఎల్ బో క్రచ్చేస్, అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు సహాయక పరికరములు అందిస్తారని వెల్లడించారు. ట్రై పాడ్, టెట్రా ప్యాడ్,చేతి కర్రలు, వీల్ చైర్, వాకర్స్, వాష్ రూమ్ వీల్ చైర్, నడుం పట్టి, మెడ పట్టి, వినికిడి యంత్రాలు, ఫూట్ కేర్ యూనిట్, వాకింగ్ స్టిక్ విత్ సీట్, చంక కర్రలు, ఫోమ్ కుషన్, మోకాళ్ళ పట్టీలు, సహాయక పరికరములు ఇస్తారని తెలిపారు. దివ్యాంగులు, వృద్దులు కావాల్సిన పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు.ఈ నెల 6వ తేదీ గురువారం చందుర్తి రైతు వేదికలో, 7 వ తేదీన శుక్రవారం వేములవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయముల సముదాయంలో, 10వ తేదీన సోమవారం ముస్తాబాద్ రైతు వేదికలో, 11 వ తేదీన మంగళవారం సిరిసిల్ల సి.నా.రె. కళామందిరంలో శిబిరాలు నిర్వహిస్తారని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. శిబిరంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎంపీడీఓ శశికళ, తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో నిర్వహిస్తున్న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు, కొనుగోళ్లు పరిశీలించారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని, తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి తరలించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలి అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇల్లంతకుంట లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులు తమ కలల ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. సందర్శనలో గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, ఎంపీడీఓ శశికళ, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిల్ పంపిణీ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఇస్తున్న మన మోడీ కానుక సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో లక్ష్మీరాజం,ఎంపీడీవో శశికళ , ఎస్సై సిరిసిల్ల అశోక్ , సిపిడిఓ రోజా ,విశిష్ట అతిథి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, జడ్పిహెచ్ఎస్ ఇల్లంతకుంట ప్రధానోపాధ్యాయులు ప్రేమ లత,జడ్పీహెచ్ఎస్ అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ మనలాగే పేదరికం నుంచి పేద విద్యార్థిగా ప్రస్థానం మొదలుపెట్టి హోం శాఖ సహాయ మంత్రి గా ఎదిగిన బండి సంజయ్ కుమార్ పేద విద్యార్థులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో సైకిల్ పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టారని అన్నారు.బండి సంజయ్ కుమార్ పుట్టినరోజున.మోడీ కానుక పేరుతో కరీంనగర్ పార్లమెంటు పరిధిలో 20 వేలకు పైగా విద్యార్థులకు సైకిల్ పంపిణీకి నడుం బిగించి పూర్తి చేశారని అన్నారు. అదేవిధంగా బండి సంజయ్ అన్న ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం కొనసాగించడానికి సాయశక్తుల పనిచేస్తారని చెప్పారు. అదేవిధంగా ఒకటవ తరగతి నుండి 5వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోడీ కిట్ పేరుతో సహాయాన్ని ప్రణాళిక చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించే దిశగా పార్లమెంట్ సభ్యులు హోం శాఖ సహాయ మాత్యులు అనేకమైన సేవా కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థుల కోసం గొప్ప చేయూత ఇస్తున్న బండి సంజయ్ కి మీయొక్క 100శాతం ఉత్తీర్ణత మంచి మార్కులను రిటర్న్ గిఫ్టుగా ఇవ్వాలని ఈ సందర్భంగా విద్యార్థులను విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎస్ ఐ. ఎంపీడీవో వారి యొక్క సూచనలను, అనుభవాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు, జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్, ఓబీసీ రాష్ట్ర నాయకులు అడిచెర్ల రాజు మండల ఇన్చార్జి సంఘ నరేష్ రిటైర్డ్ ఎమ్మార్వో సామ బాల్ రెడ్డి,బీజేపీ నాయకులు, కార్యకర్తలు ,సీనియర్ ఉపాధ్యాయులు వి.మహేష్ చంద్ర,ఆర్. రమణారెడ్డి, ఎస్.మధుసూదన్ రావు, ఎం.మంజుల,ఎం.లత,పి.అనిల్ కుమార్,పి.సునీత,ఏ.కవిత,పి.స్వప్న,సి.హెచ్. సంపత్ రావ్,వి.సరిత,ఫయాజ్ మోహమ్మద్, ఎస్.సుజాత దేవి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ మాకొద్దు

## - రోడ్డుపై ధర్నాకు దిగిన సోషల్ వెల్ఫేర్ బాలికలు

**వేద న్యూస్, మెట్ పల్లి :**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణం అరపేట శివారులో గల బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ మాకొద్దంటూ విద్యార్థినిలు రోడ్డెక్కారు. గత కొంతకాలంగా వేధింపులు ఎక్కువయ్యాయని విద్యార్థినిలే కాకుండా ఉపాధ్యాయులు కూడా వేధింపులకు లోనవుతున్నారని విద్యార్థినిలు మండిపడ్డారు.జాతీయ రహదారిని నిర్బంధించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అధికారులతో కలిసి నచ్చజెప్పె ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రిన్సిపల్ గత కొంతకాలంగా వేధింపులకు గురి చేస్తుందని, ఇంటర్ సెక్షన్ వద్దంటుందని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలనే కాకుండా ఉపాధ్యాయునిలను వేధించడంతో ఇద్దరూ ట్రాన్స్ఫర్ చేసుకున్నారని అందువల్ల సిలబస్ పూర్తి కాలేదని అందువల్ల పరీక్షలు రాయలేని దుస్థితి నెలకొందని అన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ మాపై దాడులకు ప్రయత్నిస్తుందని అటువంటి ప్రిన్సిపల్ మాకొద్దంటూ నేడు రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే రోడ్డుపై కూర్చుంటామని బీష్మించడంతో అధికారులు పూర్వాపరాలు పరిశీలించి ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థినిలు శాంతించారు.

# 20శాతం తేమ ఉన్నా మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

## - కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి డిమాండ్



**వేద న్యూస్,శాయంపేట:**

ఇరవయి శాతం తేమ ఉన్న మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్న కేంద్రం సి సి ఐ కేంద్రాలలో కొనుగోళ్లలో పరిమితి లేకుండా రైతు ఎంత పత్తి పండిస్తే అంత పంటకు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తి కొనుగోలు ఒక రైతుకు ఎకరాకు పన్నెండు క్వింటాళ్లు నుండి ఏడు క్వింటాలకు కుదించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒక ఎకరానికి పది క్వింటాళ్లు పత్తి పండిస్తే ఏడు క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగతా మూడు క్వింటాళ్ల కోసం దళారులను ఆశ్రయించడం వల్ల రైతు ఆర్థికంగా నష్టపోతాడని తెలిపారు. అధిక వర్షాలతో రైతులు ఇబ్బందులలో ఉన్నారని, రైతును ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి తీసుకురావద్దని సూచించారు. అలాగే పన్నెండు శాతం తేమ కాకుండా వర్షాభావ పరిస్థితుల వల్ల ఇరవయి శాతం తేమ ఉన్న మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కపట ప్రేమ చూపిస్తూ రాష్ట్రంలో పంట నష్టం పై ప్రశ్నిస్తున్న బీజేపీ తమ పరిధిలోని ఆంక్షలను ఎత్తివేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారపెల్లి రవీందర్, చిందం రవి, మారపెల్లి వరదరాజు, రంగు బాబు, అంకేశ్వరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఆరోగ్య శిబిరం

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విలాసాగర్ పి.హెచ్.సి డాక్టర్ దివ్య, ఎం.ఎల్ హెచ్పి, డాక్టర్ శిరీష, ఆధ్వర్యంలో పిల్లలందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పిల్లలకు ఎనీమియా, ఓరల్ హెల్త్,హ్యాండ్ వాష్ టెక్నిక్స్, ఆరోగ్య సూచనలు , పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వి.శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్స్ శశికళ, కృప, ఆరోగ్య కార్యకర్త సునీత, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రైలు ప్రమాదం..!

**వేద న్యూస్, నెట్వర్క్ సోర్స్:**



ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం ఉదయం ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. బిలాస్‌పుర్‌లో ప్యాసింజర్, గూడ్స్ రైలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించినట్లు మరో 25 మంది ప్రయాణికులు గాయపడినట్లు ప్రాథమిక సమాచారం. అయితే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయచర్యల్లో నిమగ్నమయ్యారు. అయితే, ప్రమాదానికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు.విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది రెస్క్యూ, వైద్య బృందాన్ని సంఘటనా స్థలానికి పంపారు. స్థానిక యంత్రాంగం కూడా సహాయం అందించడానికి అక్కడికి చేరుకుంది. అయితే ఈ ప్రమాదంతో ఆ మార్గంలో వెళ్లే రైళ్లలో పూర్తిగా అంతరాయం ఏర్పడింది. అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. బిలాస్‌పూర్-కట్ని విభాగంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై రైల్వే యంత్రాంగం దర్యాప్తు ప్రారంభించింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# భూకబ్జాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- సిపిఎం పార్టీ డిమాండ్



**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

పార్వతీపురం మండలం కేంద్రలో ఇటీవల సర్వే నెంబర్ లు మార్చి వరహాల గెడ్డ స్థలాన్ని అమ్మకం జరిపిన అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బి వి రమణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారిని కే హేమలత కి భూ కబ్జాలు, లేని భూమికి పక్క సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయడం ,తప్పుడు రిజిస్ట్రేషన్ లపై సమగ్రమైన అంశాలను తో కూడిన వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం గా పార్వతీపురం ఏర్పడిన తర్వాత భూముల విలువ పెరిగిన నేపథ్యంలో పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డ లు ఆక్రమణలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని, దీనికి అధికార పార్టీ పెద్దలు సహకారం అందిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి భూ ఆక్రమణలకు రెవిన్యూ,రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల అధికారులు కూడా తోడ్పాటు అందిస్తున్నారని , మున్సిపల్ నిబంధనల ప్రకారం చెరువులు, గెడ్డ పోరంబోకు స్థలాలలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఆ అంశాలను బహిరంగంగా ప్రకటిస్తే ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు భూ ఆక్రమణలు జరగవని తెలిపారు. పార్వతిపురం పట్టణంలో అనేకమైన చెరువులు, గెడ్డ పోరంబోకు స్థలాలు ఆక్రమణ గురవుతున్న విషయాన్ని ఇప్పటికే అనేక సందర్భాలలో జిల్లా అధికారులకు తెలియ చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడం వలన ఆక్రమణ దారులు బరితెగించి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ, మున్సిపల్, యంత్రాంగం ఈ అక్రమణ లపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, వరహాల గెడ్డ పూర్తి స్వరూపం తెలిపేలా హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 410 సర్వే నెంబర్ లోని వరహాల గెడ్డ భూ ఆక్రమనల పై త్వరలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.దీనికి జిల్లా రెవెన్యూ అధికారి కే హేమలతస్పందిస్తూ వరహాల గెడ్డ ఆక్రమణల అంశం ఇప్పటికే మా దృష్టికి వచ్చిందని తక్షణమే దర్యాప్తు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కళావేదికను ప్రారంభించిన ప్రభుత్వ విప్



**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా**

కురుపాం నియోజకవర్గం, కొమరాడ మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన పాఠశాల కళావేదికను, కంప్యూటర్ ల్యాబ్ ను మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అలాగే మండల కేంద్రంలో 38 లక్షలతో నిధులతో ఎం.ఆర్.సి నూతన భవనానికి మరియు సాంఘిక సంక్షేమ పాఠశాలలో 18 లక్షల నిధులతో నూతన సైన్స్ ల్యాబ్ కు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరినిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో జరిగే సమావేశాలకు, పిల్లల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ యొక్క కళ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అనేది చాలా అవసరమని, ప్రతి విద్యార్థిని కంప్యూటర్ గురించి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్, జనసేన మండల కన్వీనర్ శ్రీకర్, బిజెపి మండల కన్వీనర్ సురేష్, నాయకులు రాఘవ, హరిప్రసాద్, భానుజీరావు, కిషోర్, కొమరాడ మండలం తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు నూకరాజు, సత్యనారాయణ, ఉపేంద్ర, అనంత్, లక్ష్మణరావు, బలరాం, కృష్ణం నాయుడు, కిరణ్, రామకృష్ణ, శ్రీకాంత్, కృష్ణ, సత్యనారాయణ, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జిలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం..!




**వేద న్యూస్, కేయూ:**

పెండింగ్ లో ఉన్న 8300 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. మంగళవారం కేయూ క్యాంపస్ లోని వి ఆర్ ఎస్ హాస్టల్ ముందు స్కాలర్స్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయకుండా మాటలతో పబ్బం గడుపుతుందని, ఫీజులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని,గతంలో ప్రైవేటు యజమాన్యాలు ఫీజు ల విడుదల చేయాలని ఆందోళన చేసిన నేపథ్యంలో రెండు విడతలుగా 1200 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం, విడుదల చేయకుండా మాట మార్చిందని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చలేకుండా ప్రభుత్వం దాటవేసిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి విద్యార్థుల సంక్షేమ పట్ల చిత్తశుద్ధి లేదని, అందుకనే ఫీజు విడుదలలో జాప్యం చేస్తుందని అన్నారు, ఫీజులు విడుదల చేయాలని కోరితే విజిలెన్స్ దాడులకు ఆదేశాలు ఇవ్వడం సిగ్గుమాలిన దుశ్చర్య అన్నారు. ఫీజులు విడుదల చేయమంటే కక్ష సాధింపు చర్యలు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న ఫీజులను విడుదల చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ స్కాలర్స్ నేతలు కందికొండ తిరుపతి, కేతపాక ప్రసాద్, గుండేటి సుమన్, ఏ.సూర్య కిరణ్ లు పాల్గొన్నారు.

# బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నగరంలో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎన్ ఐ యు ఏ ప్రతినిధులకుసూచించారు.మంగళ వారం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ఐయుఏ) వారు నిర్వహించిన వర్చువల్ సమావేశం లో కమిషనర్ ప్రధాన కార్యాలయం నుండి పాల్గొని ప్లాంట్ ఏర్పాటు కు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరం లో 100 టి పి డి సామర్థ్యం తో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఇందుకు సంబంధించి గతం లో నగరం లో చెత్త సేకరణకు చెందిన సమాచారం అందజేశామని, ఎన్ ఐ యు ఏ వారు నగరం లో క్షేత్ర స్థాయి లో వాస్తవ శానిటేషన్ స్థితి గతులను కూడా అధ్యయనం చేశారని, ఇందుకు సంబంధించి చెత్త సేకరణ విధానాలు? చెత్త తరలింపు పద్ధతులను సమగ్రంగా అధ్యయనం చేసిన నేపథ్యం లో ప్లాంట్ ఏర్పాటు అవసరమైన సామాగ్రి సమకూర్చుకొని ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎంహెచ్ఓ డా.రాజేష్, ఎన్ఐయుఏ సభ్యులు అనురీత, దీప్తి ప్రతి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు

# నష్టపోయిన పంట, ఆస్తి వివరాలు త్వరగా సమర్పించాలి



- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి:**

వరదల వల్ల నష్టపోయిన పంట, ఆస్తి వివరాలు త్వరగా నమోదు చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇటీవల జరిగిన భారీ వర్షాల వల్ల జిల్లావ్యాప్తంగా వాటిల్లిన నష్టంపై వివరాల నమోదు పురోగతి, పునరుద్ధరణ కు చేపట్టాల్సిన తాత్కాలిక, శాశ్వత పనులు, రూపొందించాల్సిన జిల్లా, మండలాల సమగ్ర ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదల వల్ల పంటలు, ఆస్తులు, మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాల వివరాలను వెంటనే నమోదు చేసి సమర్పించాలని అన్నారు. పునరుద్ధరణకు తాత్కాలిక, శాశ్వత మరమ్మతు పనుల వివరాలను రెండు రోజుల్లోపు సమర్పించాలన్నారు. అలాగే భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వానికి సమర్పించుటకు జిల్లా, మండలాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ లు సుమా, ఉమారాణి, వ్యవసాయ, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, విద్యుత్, రెవెన్యూ, మునిసిపల్, పశు సంవర్ధక, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజశేఖర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన జర్నలిస్ట్లు



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, తండ్రి అతికం రాములు గౌడ్, ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కరీంనగర్ లోని సీతారాంపూర్ లో గల స్వగృహంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపూరావు, పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరుణాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



- ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం అందించాలి
- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటపొలాలను మంగళవారం మండలంలోని ఇస్కబావిగూడెం గ్రామంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతు లకు అపార నష్టం వాటిల్లి భారీ ఎత్తున పంట నష్టం జరిగిందన్నారు.ఇంతజరిగినప్పటికీ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు ఎవ్వరు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయకపోవడం శోచనీయమన్నారు.అకాల వర్షాల కారణంగా పంటలకు నష్టంవాటిల్లిన రైతులకు ఎకరాకు రూ. 40వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుచేసి మద్దతు ధరను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి గ్రామశాఖ అధ్యక్షుడు తంగేళ్ల సీతా రాంరెడ్డి,రైతులు మంచికంటి.అమృతరెడ్డి, కట్టా,ఆదిరెడ్డి,బిరెడ్డి,సైదిరెడ్డి,గోలిప్రభాకర్, వల్లపుదాసు అశోక్, గుర్రం జనార్దన్ రెడ్డి, మందడి శేఖర్ రెడ్డి, మంచికంటి కరుణార్ రెడ్డి,వల్లపుదాసు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# బాలుడికి ఆర్థిక సహాయం



**వేద న్యూస్ గంగాధర:**

గంగాధర మండలం మధురానగర్ ఎక్స్రోడ్లో జరిగిన సదర్ కార్యక్రమంలో సూర్య తేజ్ అనే బాలుడు ప్రమాద వశాత్తూ గాయపడగా అతనిని ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటన విషయం తెలిసిన తూడి లచ్చన్న సమాచారం ఇవ్వడంతో, వెంటనే స్పందించి మాజీ సర్పంచ్ నగరపు సత్యనారాయణ టీఎల్ యువసేన సభ్యులు పిట్టలు మనోహర్, కోల అజయ్, పడాల తిరుపతిలు బాధిత కుటుంబానికి రూ. 20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తరువాత సూర్య తేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి సత్యనారాయణ ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. తమను ఆపదలో అందుకున్న తూడి లచ్చన్నకు సూర్య తేజ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

బుధవారం నవంబర్ 05, 2025

# ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందజేత



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన గుడి వసంత అనారోగ్యం కారణాల వల్ల ఆస్పత్రిలో చేరారు. ఆమెకు ఆక్సిజన్ కాన్సెంట్రటర్ అవసరం కాగా, ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ ను సంప్రదించారు. ఆయన ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో ఆమెకు ఆక్సిజన్ కాన్సెంట్రటర్‌ను మంగళవారం అందజేశారు. గత పది సంవత్సరాలుగా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలలో విద్య, వైద్యం, ఉపాధి కార్యక్రమాలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, వికలాంగులకు జైపూర్ ఫుట్ ను మరియు తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాల ను ఏర్పాటుచేస్తున్నామని గుణసాగర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ది కుమార్, పోరెడ్డి కిషన్ రెడ్డి గుడి శ్రీధర్ రెడ్డి ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత పాల్గొన్నారు

# అవగాహన సదస్సులు నిర్వహించండి

- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో
- నకిలీ విత్తనాలపై ఏడీఏకు ఫిర్యాదు
- పేరు లేని కంపెనీ విత్తనాలు కొనొద్దు
- తెలంగాణ రైతు రక్షణ సమితి నేత కిషన్‌రావ



**వేద న్యూస్, వరంగల్ :**

జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలకు బలికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు పిలుపునిచ్చారు. పరకాల వ్యవసాయ అభివృద్ధి అధికారి (ఏడీఏ) జగదీష్ రెడ్డికి ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొన్ని పేరు లేని కంపెనీ లకు చెందిన దళారీలు గ్రామాలకు చేరుకుని అధిక దిగుబడులు వస్తాయని చెబుతూ రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలకు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండానే రైతులకు విత్తనాలు విక్రయించేం దుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. "ఇలాంటి విత్తనాలు వాడితే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడవలసి వస్తుంది. కాబట్టి రైతులు ప్రభుత్వ గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. అవసరమైతే ముందస్తు ఒప్పందాల ద్వారా పంట సాగుచేయాలి," అని కిషన్ రావు సూచించారు. తు ఫాను కారణంగా ఇప్పటికే పంటలు నష్టపోయిన రైతులు మళ్లీ మొక్కజొన్న పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, నకిలీ విత్తనాలు అందితే పరిస్థితి మరింత దయనీయ మవుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో అవగాహనా సదస్సులు నిర్వహించి రైతులకు పూర్తి సమాచారం అందించాలని సమితి అధికా రులు ఏడీఏను కోరారు. కార్యక్రమంలో నాగూర్ల రాజీవ్, మోకిడే మోహన్ రావు, బాసిడి బాపూరావు, జుంక జువ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ఐకేపీ సెంటర్ల సందర్శన



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలలో ఐకేపీ సెంటర్లను బీజేపీ మండల నాయకులు మంగళవారం సందర్శించారు. రైతుల బాధలను వారి కష్టాలను తెలుసుకున్నారు. ఐకెపి సెంటర్లలో పది రోజులుగా వడ్లను నిల్వ ఉంచిన ఇప్పటివరకు కూడా మిల్లుల అలాట్‌మెంట్ లేక వడ్లు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. సెంటర్లలో కనీస సౌకర్యాలులేవని తెలిపారు. కనీసం వడ్ల పైన కప్పడానికి టార్పన్ పరదలు కూడా ఇవ్వట్లేదని, ఎండిన వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఎల్కతుర్తి యార్డ్‌లో ఐకేపీ సెంటర్లో 20 లక్షల గన్నీ బ్యాగులున్నా రైతులకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. గత నెల 25న ఐకెపి సెంటర్లు ఓపెన్ చేసి ఇప్పటివరకు కూడా ఒక క్వింటాల్ వడ్లు కొనక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని తెలిపారు. మిల్లుల అలాట్‌మెంట్ సరిగా లేకపోవడం.. కమీషన్ల బేరం కుదరకపోవడం కోసమా? అని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ విమర్శించారు. వడ్ల కొనుగోలులో జాప్యం జరిగితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని, రైతులతో కలిసి రోడ్లపైన ధర్నాలు చేయడానికి సిద్ధమని రైతుల బాధలను చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య,జనగాం కిష్టయ్య, కోడం రమేష్, ఠాకూర్ అంబిర్ శ్రీనివాస్, అల్లి కుమార్, దాసరి సాయి తేజ, కుమారస్వామి, తిరుపతి యాదవ్ స్థానిక రైతులు పాల్గొన్నారు

# సమస్యలను పరిష్కరించాలి



**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7, 8 తేదీలలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సర్వేలు నిర్వహిస్తున్నామని ఈ సర్వేలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా ప్రజలు అంటూ వ్యాధులు, విష జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో ప్రజలు జ్వరాలతో బాధపడుతుంటే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిమ్మకు నేరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24 గంటలు వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అన్ని జబ్బులకు టెస్టులు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పారిశుద్ధ్య నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ వైద్య రంగంలో నెలకొన్న సమస్యలపై నవంబర్7,8 తేదీలలో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సర్వేలు నిర్వహించి సమస్యలపై నవంబర్ 9న జిల్లా వైద్యధికారికి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు, జిల్లా నాయకులు పులుసు సత్యం, పోషణ బోయిన హుస్సేన్, జంపాల స్వరాజ్యం, గుంజ వెంకటేశ్వర్లు, సోమపంగా జానయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, కొండమీది రాములు, అంజాపల్లి లక్ష్మయ్య, కల్లేపల్లి భాస్కర్, షేక్ సైదా హుస్సేన్,కోండమడుగుల చిన్న వెంకటేశ్వర్లు, జాజుగల్లా ముత్తయ్య, శిగ శ్రీను, చిన్న బోయిన వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

**వేద న్యూస్, హనుమకొండ :**

హన్మకొండలోని జిల్లా పరిషత్తు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ను సందర్శించి అందులో వయో వృద్ధులకోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఎలా నడుస్తుందో పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కోసం లీగల్ సలహాలు, సూచనలు కోసం సంప్రదించడానికి నియమించిన పారా లీగల్ వాలంటీర్ ఉపెందర్ ని ఎన్ని కేసులు నచ్చాయి, సలహాలు, సూచనలకోసం ఎంత మంది వచ్చారు. కౌన్సిలింగ్ కి ఎంత మంది వచ్చారు అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ మరియు ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వరం అన్నారు. జిల్లాలోని ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు పని చేస్తూన్న తీరును డాక్టర్ అనితా రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ ఉష, పారా లీగల్ వాలంటీర్ ఉపెందర్,వాణి తదితరులు పాల్గొన్నారు.




– డాక్టర్ అనితా రెడ్డి

# అసమాన్యుడు సబ్బని వెంకట్

- సాధారణ కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి..
- మల్టీనేషనల్ కంపెనీ 'జెన్‌ప్యాక్ట్' గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా సిర్సపల్లివాసి
- విద్య, వైద్యంపాటు హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై గళం





**వేద న్యూస్, హుజూరాబాద్:**

కృషితోనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని మాటల్లో చెప్పడం కాకుండా చేతల్లో చేసి చూపిస్తూ..ముందుకు సాగుతున్నారు సిర్సపల్లివాసి సబ్బని వెంకట్. ఓ సాధారణ కుంటుంబంలో జన్మించిన వెంకట్ అసాధారణ వ్యక్తిగా ఎదిగి..తన ప్రాంతానికి సైతం సేవ చేయాలని తన వంతు శక్తి మేరకు కృషి చేస్తుండటం విశేషం.యువవాదిగా పేరు గాంచిన వెంకట్‌యువవాది, సేవావాదిగా పేరు గాంచిన సబ్బని వెంకట్.. తన ఊరు, తన ప్రాంతం హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి విషయమై తన వంతు కృషి చేస్తున్నారు. బ్లడ్ డొనేషన్స్, మెడికల్ క్యాంపుల నిర్వహణ, యువతకు క్రీడల్లో ప్రోత్సాహకం విషయమై తన వంతు సాయం చేస్తున్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు తన వంతుగా సాయశక్తి మేర పని చేస్తున్నారు. 'జెన్‌ప్యాక్ట్' వంటి మల్టీ నేషనల్ కంపెనీకి గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. సేవా కార్యక్రమాలనూ ముందుకు తీసుకెళ్తున్నారు. సబ్బని వెంకట్ తండ్రి వృత్తిరీత్యా సింగరేణి ఉద్యోగం చేస్తూ బెల్లంపల్లిలో నివాసం ఉండేవారు. వెంకట్ విద్యాభ్యాసం బెల్లంపల్లిలోనే కొనసాగింది. అక్కడే ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశారు. అనంతరం తండ్రికి భూపాలపల్లి బదిలీకావడంతో అక్కడికి మారారు. అక్కడ సైతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. అనంతరం 2007లో ఐబీఎం సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన వెంకట్ ప్రస్తుతం మల్టీ నేషనల్ కంపెనీ 'జెన్ ప్యాక్ట్' లాంటి సంస్థకు గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. సమాజసేవలో తాను సైతం అని ముందుకు సాగడమే కాకుండా తన టీమ్ సభ్యులతో కలిసి సబ్బని వెంకట్ నిత్యం ఆపదలో ఉన్న వారికి అండగా బ్లడ్‌ను అందజేస్తున్నారు. ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా తన టీమ్ మెంబర్స్ ద్వారా బ్లడ్ అరేంజ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీలలో రెఫరల్ ద్వారా ఉద్యోగాలు పొందేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అగ్నిప్రమాద బాధితులకు వెంకట్ అండ ఇక మానవత్వానికి ప్రతీకగా నిలిచేలా హుజురాబాద్ పట్టణంలోని మార్కెట్‌లో అగ్ని ప్రమాదం సంభవించినపుడు బాధితులకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకున్నారు. చిరువ్యాపారులకు సబ్బని వెంకట్ చేయూతను అందించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు హుజూరాబాద్ ప్రాంత అభివృద్ధికి తన వంతుగా కృషి చేయాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నట్టు సబ్బని వెంకట్ వెల్లడించారు. హుజురాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ సమగ్ర అభివృద్ధిపై సబ్బని వెంకట్ తన గళాన్ని బలంగా వినిపిస్తున్నారు. ఈ ప్రాంతంలో జాతీయ స్థాయి విద్యా సంస్థను, మెడికల్ కాలేజీని స్థాపించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. ప్రజల తరఫున బలమైన గొంతుకగా అభివృద్ధి చేయాలని నినదిస్తున్నారు.